# కథలు

పుడిపెద్ది వెంకటరమణయ్య

అమ్మమ్మో నాయనమ్మో అలవాటుచేసింది కథలు చెప్పడం. అల్లరిమానేసి ఆలకించే వాళ్లం చిన్నప్పుడు కథలు. చిన్నవో పెద్దవో, చిత్రమయినవో, ఊహాప్రపంచంలో ఇమిడేవో ఇముడనివో ఏవోరకంకథలు అలవాటుగా ప్రతిరాత్రీ నిద్రపోయేముందుగా ఒకటో రెండో విని పడుకోవాలి. కొన్ని కథలు మంత్రాలవలె కంఠతా వచ్చేదాకా ఆలకించి అలవరుచుకున్నాంకూడా. కథలాలకించడం మనకుసనాతనంగావచ్చే అలవాటూ, ఆచారమూకూడా అయింది. ఏదయినాకథ మన మాలకించేటప్పుడు కథాంశము మనకు హృదయస్థమై మనస్వభావాదులకు నచ్చిన వస్తువే అయితే దానితో మన మైక్యమయిపోయి మరీ ఆలకిస్తాం ఆకథను. ఇలాంటిచోట్ల కథ చెప్పేవాని చేతకానితనంకూడా నేర్పుగానే పరిణమిస్తుంది. ఆకథకు ఆలకించేవాడు వన్నెయిస్తాడు. కథ మంచిది అంటే శ్రోత మంచివాడే అన్నమాట.

పూర్వ మొకప్పుడు, యశోద శ్రీకృష్ణుని నిద్రపుచ్చుటకుగాను, ఊయలలో వేసిఊస్తూ "రాముడనే రాజుండేవాడురా, కృష్ణా" అంది. ఊఁ! అని ఊఁకొట్టేడు కృష్ణుడు. "వానికి సీత అనే భార్యగలదు." ఊఁ అన్నాడు మొదటిమాటుకంటె కాస్త శ్రద్ధగా. "ఆ రాముడు తండ్రి ఆజ్ఞ ననుసరించి భార్యతో కూడా అడవికిపోయాడు." ఊఁ అన్నాడు మరింత గట్టిగా. "ఆ అడవిలో వారుండగా రాముని భార్యను రావణుడెత్తుకొనిపోయినాడు." ఈ మాటు ఊఁకొట్టుటకు మారుగా "లక్ష్మణా! విల్లు బాణము తీసుకురా. ఆ పాపాత్ముణ్ణి కొట్టేస్తా" నన్నాడట చిన్నికృష్ణుడు. ఇందలి అంతరార్థ మేదో మన కక్కరలేకపోతే యశోదమ్మ చెప్పిన ఆ పొడిముక్కలే చిన్నికృష్ణుని హృదయాన్ని కదలించ గలిగేయి. అలాంటి పాఠకులు దొరుకుతారు అదృష్టవంతుడయిన కథకుడికి. కథకు నిరచనాచాకచక్యం పాఠకునిభావనాశక్తిలో ఉంటుంది.

క్రమక్రమంగా కథలు చెప్పడం, ఆలకించడం ఒక విధమయిన సంప్రదాయంగా ఏర్పడి, విద్యాబుద్ధులు, నీతి, భక్తి మొదలయినగుణాలలవరచడానికి కథలే సాధనాలుగా గ్రహింపబడ్డాయి అదినుండీ. మన కెక్కడ చూచినా కథే, ఇతిహాసమే. మన చదువే అది అయి సాంఘికజీవనమే అది అయింది. శ్రోతలుకూడా వారికి కథ లాలకించే ఉత్సాహం నానాట హెచ్చుచేసుకుంటున్నారుగాని వెనుకబడలేదు.

కొలది సంవత్సరాలనుండీ మనకు కథ లాలకించే విధానంలో మార్పు కావలసి

వచ్చింది. ఇందుకోసం, ఆంగ్లవిద్యాసంపర్కం ఉండడంవల్లా, మనం ఫ్రెంచిదేశపుకథలూ, రష్యాదేశపు కథలూ, ఇంగ్లీషు దేశపుకథలూ, ఇంగ్లీషుభాషలో చదవడమేకాకుండా, ఇప్పటి విదేశీయరచయితల క్రొత్తకథలూ, అవి చెప్పే విధానమూ మున్నగునవి ఆంగ్ల పత్రికలలో చదివి - తెలుగులో, మనకు అందుబాటులోనున్న లక్షణాలనే పరికొని లక్ష్యాలుగా మనవాళ్లూ కథలు ఆంధ్రంలో వ్రాయడం మొదలెట్టేరు. ముందు ముందు లక్ష్యాలు బయల్దేరుతున్నాయి, వడి వడిగా వేడివేడిగా సెల్లాగు. వీనినిబట్టి లక్షణాలేర్పడాలి. ఇదివరకే లక్షణలక్ష్యాలతో సమృద్ధము లయిన ఆంగ్లభాషలోని చిన్నకథలు మన కన్నిటా ఆదర్శాలుగా ఉండాలంటే కుదరదు. అయితే ఆరచనావిధానంలో ఉత్కృష్టపద్ధతులనుమాత్రము మనము స్వీకరించవచ్చును.

ఇంతకూ మన తెలుగులో చిన్నకథలు చిన్న చిన్న పూవులలా విడుతున్నాయి, యీ రోజుల్లోనే లక్షణాలుగుర్తించి కూర్చడాని కవకాశం చాలదేమో. చిన్నకథలు అనేక విధాల వ్యాప్తంకావాలి. అవి రచించడానికీ చదువడానికీకూడా మనము బాగా అలవాటుపడాలి. అప్పుడు చిన్నకథలకు సర్వజనాంగీకృతము లయిన లక్షణసూత్రాలేర్పడాలి. ఇప్పుడే లక్షణచర్చకు దొరకొనుట నాటిన విత్తనము మొలకెత్తినదేమో చూచుటకుగా దానిని పెకలించుటవంటిది. దానికి తగినకాలము విడిచి ఆ గ్రంథము బహుళముగా పెరుగనిచ్చి దేశాభిరుచినీ, కాలమర్యాదనూ అనుసరించి లక్షణాలు నిర్ణయింపవలెను గదా.

అయితే ఇప్పటి కొకరకంగా మీద మీదను చిన్నకథల లక్షణాలు మనము కొలదిగా గుర్తించవచ్చును. ఇవి కాలప్రవాహంలో కొట్టుకొనిపోవచ్చును, లేదా దాని రాపిడిలో సానదీరనూ వచ్చును.

చిన్నకథలరచన మన మనుకున్నంత సులభమయినది కాదు. దాని రచనకూ విశేష చాకచక్యం కావాలి. తీయని పలుకులలో పొదివి చల్లనిరసము చిమ్మే భావసంపదతో, ఏదో ఒక మానవస్వభావ సంఘట్టనమును చిన్ని చిన్ని ఉదంతములతో వాకొనడం కథారచనగదా!

చిన్నకథల రచన గుజ్జనగూడు వంట వంటిది. దానిలో, వయోభేదం లేకుండా రుచి కలిగించడమే ఒకకళ. పిట్టచిన్నదయినా కూత ఘనమే. చిన్నం కావాలి చింతాకు కావాలి, మేలిమి కావాలి మెడ తిరగాలి, నగ ఏదయినా సరే, గ్రహించేవానికి తాత్కాలిక హృదయవికాసం కలిగించడమే కాకుండా, పై మెత్తుటూహలు పల్లవించాలి. ఇట్టి సందర్భ సన్నివేశాలలో నేను కూడ ఇట్లే చేసియుందునని చదువరి ఊహించు నంతటి సహజంగా ఉండాలి కథాగమనం. కథాంశము మనుష్య సహజబుద్ధి నుట్టంకించి చూపవలెనే కాని, నాటకాదులలోని ఇతివృత్తంలాగు, స్వభావవైపరీత్యాన్ని ప్రస్తరించరాదు. ఇందు సమయోచిత వర్ణనలేశం తప్ప విశేషవర్ణనలతో విసువు జనింపచేసే ధోరణి మంచిదికాదు. చిన్నకథలు ఏసంస్కరణనుగాని సాగించే ప్రచారసందేశాలను నడిపే సాధనాలు కాకూడదు. అట్లయిన మనం, ఇతిహాసలక్షణంతో పురాణ

కాలానికి పోతాం. నీతికోసం, ప్రీతికోసం కథకు కాళ్లూ చేతులూ కల్పించకూడదు. సహజంగా దానికుండవలసిన కాళ్లూచేతులను కట్టి పడవేయనూ కూడదు.

చిన్నకథలలోనిభాష సరళమై బహుజనాంగీకృతమయిన ప్రయోగసరళితో నడిపించవలెనేకాని క్లిష్టనిర్మాణం పనికిరాదు. సంభాషణాదులు సహజంగా పాత్రనోట మొలచినట్టుండవలెను.

ఇట్టి వెన్నోని సామాన్య లక్షణములు మనము పేర్కొనవచ్చును. కాని చిన్నకథకు, ఆంధ్రసంప్రదాయమున కనువయిన లక్షణములు సూత్రప్రాయములుగ వెలువడే తరుణ మింకా రాలేదనుకుంటాను; కొలదిలో రాగలదు.

చిన్నకథలలో శృంగారాదిరసపోషణ మటుండ నిటీవల హాస్యముకూడ తలయెత్తుచున్నది. హాస్యము తలచూపి తొలగినపుడే హృదయంగమ మయి ఉంటుంది గాని నిలువరించిన నది నీరసమే. అందుకు చిన్నకథయే కడుంగడు తగియున్నది. ఇప్పు డాంగ్లపత్రికలలోనికథలు హాస్యరసప్రధానములుగానే నడిచినవి ఎక్కువగా పాఠకలోకం ఆదరిస్తూంది. మన ఆంధ్రంలోకూ అవి విపులంగా తలచూపుతున్నాయి.

అన్నిరచనలలోనూ హాస్యమును చిన్న మతాబావెలుగువలె రచించి విడుచుటకు చిన్నికథలు మంచిసాధనాలుగా ఉన్నాయి.

సరే. ఈ గుజ్జనగూడువంట సాగిస్తున్నారు మన ఆంధ్రరచయితలు. ఏదోఅని; వారి ప్రయత్నం మాటక్రింద నలక్ష్యంచక వయోభేదం లేకుండా పాఠకలోకం పంక్తులు సాగించి కూర్చుంటున్నారు విందు లారగించడానికి. శ్రీరామునంతటిరాజుంటే ఆంజనేయునంతటిబంటూ ఉంటాడుగా! తయారవుతున్నాయి చిన్నకథలు. దినపత్రిక మొదలు వార్షికసంచికవరకూగల అన్నిపత్రికలలోనూ, చిన్నకథ ఉండితీరా లనిపిస్తూంది; ఉంటూంది. పత్రికందుకొని ముందుగా చిన్నకథకే దేవులాడేపాఠకు లెందరో ఉన్నారు. హిందూపత్రికలో S. V. V. కథకోసం ఎదురుచూచేవా రెందరో. Strand లో Wodehouse కథ రావాలి. కథ కావాలి. అదీకథ!

ఇట్లు పంక్తులు సాగించిన పాఠకలోకం, ఈచిన్నిరచనలో ప్రయత్నంచాలదనీ, సన్నైసరిగా అందలేదనీ, కడుపు భేరీలాగు నిండలేదనీ రసజ్ఞులయినవారు గొణగరుగా. ఇందు రుచే ప్రధానం. మొగంమొత్తేదాకా మేపడం చిన్నకథపని కాదు.

రచయితలు బయల్దేరుతున్నారు. ప్రచురణకర్తలు సిద్ధమవుతున్నారు. పత్రికలూ అభివృద్ధి నందుతున్నాయి. కొలది కాలంలో చిన్నకథలు విపులంగా విరిసే వసంతసౌభాగ్యం ఆంధ్రవాఙ్మయోద్యానానికి పట్టగలదని వ్యక్తమవుతూంది. దీనికి పాఠకలోకంలో అనుభవజ్ఞులే బాధ్యులు.

ఇంకొక్కమాట చెప్పవలసిఉంది ఈసందర్భంలో. చిన్నకథలోని ముఖ్యాంశమును స్ఫురింపజేసేబొమ్మ లెంతైనా తోడ్పడతాయి కథను పాఠకునిహృదయాని కెక్కించడానికి. ఇక్కడే చిత్రశిల్పానికి, వాక్శిల్పానికీ గలసన్నిహితత్వం వ్యక్తమవుతూంది. అవి అన్యోన్యం పొందే తోడ్పాటు ప్రస్ఫుటమవుతూంది.